ఈ ప్రశ్నలకు జవాబులేవీ?

- పూర్తయిన వంద రోజుల కూటమి పాలన
- ఇచ్చిన హామీలు మరచిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- నియోజకవర్గానికి వచ్చింది రెండు సార్లే..



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టు రైతులకు హామీ ఇస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ (ఫైల్)

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటించిన ప్రతి సందర్భంలోను ఇది చేస్తాం, అది చేస్తామంటూ నమ్మించి నయవంచనకు పాల్పడ్డారని ప్రజలు మండిపడుతున్నారు. ఆయన మాటలు నమ్మి ఓటేసిన పాపానికి అప్పుడే వంద రోజులు పూర్తయింది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో స్థానిక అంశాలపై వాగ్దానం చేసిన వాటిలో మచ్చుకు ఒక్కటి కూడా నెరవేర్చిన దాఖలాలు లేవు. కనీసం ప్రతిపాదనలు కూడా ఇంతవరకు దిక్కూమొక్కూ లేకుండా చేశారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన వాగ్దానాలనే ఉపముఖ్యమంత్రి అయి వంద రోజులు పాలన పూర్తి చేసిన పవన్ కల్యాణ్.. ఒక్కటంటే ఒక్క హామీని కూడా అమలుచేయలేకపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల కోసం నియోజకవర్గంలో ఎడాపెడా పవన్ హామీల వర్షం కురిపించారు. అవన్నీ గాలిలో కొట్టుకుపోయాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాడు పిఠాపురంలో వారాహి సభలో మాట్లాడుతూ, పిఠాపురాన్ని ఆధ్యాత్మిక రాజధానిగా తీర్చిదిద్దుతానని ఘనమైన వాగ్దానం ఇచ్చారు. కూటమి సర్కార్ గద్దెనెక్కి, కేంద్ర స్థాయిలో బీజేపీ, ప్రధానితో ఎంతో సాన్నిహిత్యం ఉందని ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్న పవన్ ఇప్పటి వరకూ నిధులు ఎందుకు సాధించ లేకపోయారని పిఠాపురం ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కోత నివారణ చర్యలేవీ!?

గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన ఉప్పాడ సముద్ర కోత నివారణ చేసి తీరతానని పవన్ చెప్పుకొచ్చారు. కేంద్ర కోస్టల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాన్ని చెన్నై నుంచి తీసుకువచ్చి హడావిడి చేయడం తప్ప ఇంతవరకు చిల్లిగవ్వ కూడా బడ్జెట్‌లో కేటాయించలేక పోవడాన్ని ఉప్పాడ ప్రజలు నిలదీస్తున్నారు. ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణే కాకుండా, సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా కూడా తీర్చిదిద్దుతామని పవన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

దిక్కూమొక్కూ లేని ఆధునీకరణ

ఇటీవల ఏలేరుకు వచ్చిన వరదలతో వేలాది మంది రైతులకు కన్నీటిని మిగిల్చిన ఏలేరు, సుద్దగెడ్డ ఆధునీకరణ కోసం రూ.వెయ్యి కోట్ల ప్యాకేజీ తీసుకువస్తానని పవన్ ఇచ్చిన హామీ గాలిలో దీపమైందంటున్నారు. ఏలేరు కాలువల ఆధునీకరణతో పాటు సుద్దగెడ్డ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని గద్దె నెక్కి నూరు రోజులు పూర్తి అయినా ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పనిలో పనిగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పత్తి రైతులు సమస్యలు, పిఠాపురంలో రైల్వే పవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ కూడా నీటిమీద రాతగా మారింది. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో కేఎస్ఈజడ్ రైతుల సమస్యలు పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామన్నారు. ఇందులో ఇప్పటివరకు ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకుండా గాలిమాటలకే పరిమితమయ్యారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

పట్టుజారిన హామీ

తమ ప్రభుత్వ అధికారంలోకి వస్తే పట్టు పరిశ్రమకు ప్రోత్సాహం ఇస్తుందని పవన్ పట్టు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. పట్టు గూళ్లను పండించిన వారికి ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ప్రస్తుతం వాటిని నిలిపివేశారు. రాయితీపై ఇచ్చే మందులకు ఎప్పుడో మంగళం పాడేశారు. గతంలో ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన పవన్ కల్యాణ్ పట్టు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి వచ్చాక పట్టు రైతులకు ఇచ్చిన హామీని వదిలేశారంటున్నారు పట్టు రైతులు. ఇప్పుడు కూటమి సర్కారులో ఆయన డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నందున తమ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉప్పాడ కోత ఊసెత్తడం లేదు



ఎన్నికలకు ముందు, పూర్తయిన తరువాత పవన్ కల్యాణ్ మా ఉప్పాడ గ్రామం వచ్చారు. ఉప్పాడ సముద్ర కోత నివారణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. మత్స్యకారులకు వేట నిషేధ పరిహారాన్ని.. నిషేధం పూర్తయి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఇవ్వలేదు. దానిపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. ఇదేనా వంద రోజుల్లో సాధించింది. మంచి ప్రభుత్వం అని చెప్పుకోవాలంటే మంచి చేస్తేనే కదా చెప్పుకునేది.

– చొక్కా వెంకటేశ్వరరావు, మత్స్యకారుడు, ఉప్పాడ

ఆ హామీకి థర్టీ ఇయర్స్

- మాటలకే పరిమితమైన డిగ్రీ కళాశాల
- ఎన్నికల అస్త్రంగా వాడుకుంటున్న నేతలు
- విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



సామర్లకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

సామర్లకోట: ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ అవుతుందన్న స్థానికుల ఆశ గత 30 ఏళ్లుగా కలగానే మిగిలిపోయింది. పెద్దాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన అభ్యర్థులు దీనిని ఎన్నికల అస్త్రంగా వాడుకుంటున్నారు. అదేవిధంగా ఎన్నికల ముందు టీడీపీ తరఫున పోటీ చేసిన నిమ్మకాయల చినరాజప్ప కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సుమారు 25 ఎకరాల విశాలమైన స్థలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. పెద్దాపురం, పిఠాపురం, కిర్లంపూడి రోడ్ల జంక్షన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండటంతో, డిగ్రీ కళాశాల ఏర్పాటైతే అన్ని రకాలుగా అభివృద్ధి జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సుదూర ప్రాంతాలకు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో లేకపోవడం వలన విద్యార్థులు డిగ్రీ చదవడానికి పెద్దాపురం, కాకినాడకు వెళ్లాల్సి వస్తోంది. లేకపోతే స్థానికంగా ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రైవేటు కళాశాలల్లో ఆట స్థలాల, తగినన్ని క్రీడా సౌకర్యాలు లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా కళాశాలల్లో చేరుతున్నారు. సామర్లకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైతే, పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు కనీసం డిగ్రీ చేయడానికి అవకాశం ఉంటుందనే వాదనలు ఉన్నాయి. అదేవిధంగా సామర్లకోటలో గడియార స్తంభం,, కాపు కల్యాణ మండపం, నీలమ్మ చెరువులను అభివృద్ధి చేయిస్తామని, పెద్దాపురం శతాబ్ది పార్కుకు పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాపు కల్యాణ మంటపానికి మరమ్మతులు చేయించారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. దాని వలన పేద, సామాన్య విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. జూనియర్ కళాశాల ఆవరణలో విశాలమైన ఆట స్థలం ఉంది. దాంతో ప్రతి రోజూ క్రీడల ప్రాక్టీస్‌కు అవకాశం ఉంటుంది.

– వినయ్, ఇంటర్ సెకండియర్ విద్యార్థి, సామర్లకోట

బాలికలకూ అవకాశం



సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు ప్రత్యేకంగా మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ కళాశాల సమీపంలోనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల ఉంటే ప్రతి విద్యార్థి డిగ్రీ చదవడానికి అవకాశం ఉంటుంది. విద్యార్థులకు ఖర్చులు తగ్గి, సమయం ఆదా అవుతుంది.

– ఎస్.శ్రీమాన్విత, ఇంటర్ సెకండియర్ విద్యార్థి, సామర్లకోట

హామీలకే పరిమితం



ఎందరో ఎమ్మెల్యే అభ్యర్థులు సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిగ్రీ కాలేజి చేస్తామని హామీలిచ్చారు. ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిగ్రీ కళాశాలకు రూ.18 కోట్లు మంజూరు చేయడానికి హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాలేదు. ఎమ్మెల్యే రాజప్ప హామీని నెరవేర్చాలి.

– డాక్టర్ పాలిక చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు, సామర్లకోట

క్లుప్తంగా

వడ్లమూరులో ప్రజావేదిక సభ



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం: రాష్ట్రంలో మంచి సంక్షేమ పాలన అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా మంచి ప్రభుత్వం ప్రజా వేదిక సభ పేరిట కార్యక్రమాన్ని శుక్రవారం వడ్లమూరు గ్రామంలో నిర్వహించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్ అధ్యక్షతన వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ నాయకుడు విత్తనాల వెంకటరమణ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, ఉద్యాన శాఖాధికారి సుజాత, వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ కరపత్రం ఆవిష్కరణ



పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీసీ, నాయకులు

కాకినాడ సిటీ: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) విద్యార్థి ఉద్యమ పోరుబాటలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలో స్వర్ణోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈ.భూషణం, కె.భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ స్వర్ణోత్సవ సభను రెండు తెలుగు రాష్ట్రాల కమిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్టు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు మహర్షి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

రమణక్కపేటలో ప్రబలుతున్న వ్యాధులు



నాగులాపల్లి పీహెచ్‌సీలో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు

- క్షీణిస్తున్న పారిశుధ్యంతో అనేక మందికి సోకిన జ్వరాలు
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని మొత్తుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ప్రధాన రహదారుల్లో డ్రైన్లు పూడికలతో నిండిపోయాయి. మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దళితకాలనీలో సంబంధిత అధికారులు కనీసం పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. బయటకు రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామంలో దోమల నియంత్రణకు మందు పిచికారీ చేసిన పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆస్పత్రుల పాలవుతున్న ప్రజలు

పారిశుధ్యం అధ్వానంగా ఉండడం, రోగాలు ప్రబలుతుండడంతో అనేక మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రస్తుతం సుమారు 50 మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు తెలిసింది. ఒకవైపు జ్వరాలతో హడలెత్తుతున్న ప్రజలు, మరోవైపు క్షీణిస్తున్న పారిశుధ్యంతో బెంబేలెత్తుతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం



సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పంచాయతీల్లో ఉన్న తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను బ్లీచింగ్‌తో క్లీనింగ్ చేయించాలి. గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో ఉన్న చెత్తను తొలగించాలి. గ్రామంలో సుమారు 50 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు.

– లోద అప్పలరాజు, జిల్లా కార్యదర్శి, ఎస్సీ సెల్, వైఎస్సార్ సీపీ, రమణక్కపేట

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

రైల్వే ఏడీఈ, స్టేషన్ మేనేజర్



సామర్లకోట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై తాగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత కీలకమని సామర్లకోట రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బి.శివప్రసాద్, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. సచ్చత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు, రైల్వే చెరువులను శుభ్రం చేయించారు. గుంతల్లో నిల్వ నీరు ఉండటం వలన దోమలు పెరిగి, అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందే విధంగా చూడవలసిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. రైల్వే ప్లాట్‌ఫాంపై తాగునీటి కుళాయిల ద్వారా వస్తున్న నీటిని పరిశీలించారు. అలాగే స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులు చెత్తను డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు రవికాంత్, రామసుబ్బారావు, సంజీవ్‌కుమార్, లోవరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీగిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసు, టిక్కెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక



క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

పిఠాపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 14 నుండి 17 ఏళ్ల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా ఎంపికలు చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ చల్లా ఆంజనేయులు, బత్తుల లక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ప్రకాష్, పీడీలు సుబ్బలక్ష్మి, లంకా రవి, శ్రీహరి వరహాలు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు

నేడు స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్

కొత్తపల్లి: అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా శనివారం మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్‌కాయిస్ సంస్థ సంయుక్తంగా స్వచ్ఛసాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజర్ మోసదేవర తెలిపారు. మండలంలోని తీర ప్రాంతంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు.

జగ్గంపేటకు విస్తరించిన ఫిషరీస్ యూనిట్



జగ్గంపేటలోని ఫిషరీస్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్

సామర్లకోట: మండలంలో పనసపాడు గ్రామంలో ఉన్న దేవి ఫిషరీస్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ జగ్గంపేటకు విస్తరించింది. ఈ యూనిట్‌ను వర్చువల్‌లో కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్ (ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ), ప్రహ్లాద్ జోషి (బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ). రవ్‌నీత్‌సింగ్ బిట్టు(ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి) గురువారం సాయంత్రం ప్రారంభించారని దేవి ఫిషరీస్ యాజమాన్యం స్థానిక విలేకర్లకు శుక్రవారం తెలిపారు.

ఈ పరిశ్రమ వలన ప్రత్యక్షంగా రెండు వేల మందికి ఉపాధి కలుగుతుందని వారు చెప్పారు. తమ పరిశ్రమ ద్వారా దేశ అభివృద్ధిలో భాగమైనందుకు గర్వంగా ఉందని తెలిపారు.

కరపత్రాల పంపిణీ

సామర్లకోట: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా ఉండూరు గ్రామంలో మండల స్థాయి అధికారులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ డి శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ, సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఎంపీటీసీ ముసలి బుజ్జిమ్మ తదితరులు పాల్గొన్నారు.

సరైన పద్ధతిలో చెత్తను వేరు చేయాలి



తడి, పొడి చెత్తపై ఇంటింటా అవగాహన కల్పిస్తున్న సాయిరామకృష్ణ తదితరులు

సామర్లకోట: చెత్తను సరైన పద్ధతిలో వేరు చేసి, పారిశుధ్య సిబ్బందికి అందజేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా తమ వంతుగా తడిచెత్త, పొడి చెత్తను గుర్తించడం, వాటిని డస్ట్‌బిన్లలో వేసే విధానంపై శుక్రవారం సాయంత్రం ఇంటింటా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గోవిందు, ఏఎల్‌వీ కుమారి, కె.శ్రీనివాసు, సీహెచ్ భద్ర, కె.శేషారత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కడ తీసి.. అక్కడే వేసి..

చెత్త తరలింపులో మున్సిపల్ సిబ్బంది నిర్వాకం



పిఠాపురంలో సేకరించిన చెత్తను పట్టణంలోని ఇందిరానగర్ దారిలో వేసిన సిబ్బంది

పిఠాపురం: చెత్త.. చెత్త కాదు, సద్వినియోగించుకుంటే సంపద అవుతుంది । మున్సిపల్ అధికారులకు ఫోన్ చేస్తే వినిపించే రింగ్‌టోన్ ఇది. పారిశుధ్యం మెరుగుకు మున్సిపాలిటీ ఏటా రూ.3 కోట్లు ఖర్చు చేస్తున్నా.. పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. ఈ చెత్తను ఎవరు సద్వినియోగం చేసుకుంటున్నారో ఇట్టే అర్థమవుతుంది. ప్రధాన రహదారుల పరిశుభ్రతపై మాత్రం కాస్త శ్రద్ధ చూపుతున్నారు. మిగిలిన రోడ్ల పరిస్థితిని అధికారులు పట్టించుకోవడం లేదు. డ్రైవర్స్ కాలనీ, గోర్స రోడ్డులోని ఏడు కాలువలు, అగ్రహారంలోని ఇరుకు సందులు, జగ్గయ్యచెరువు, కత్తులగూడెం తదితర ప్రాంతాల్లో చెత్త తొలగింపు అంతంత మాత్రమే.

డంపింగ్ యార్డు నిర్మించినా..

గతంలో పాదగయ క్షేత్రం వద్ద, గొల్లప్రోలు రోడ్డులోని పశువుల సంత వద్ద చెత్తను డంప్ చేసేవారు. ఆ తర్వాత పట్టణానికి సుమారు 3 కి.మీ. దూరంలో ఉన్న మాధవపురం రోడ్డులోని గోదావరి కాలువ సమీపంలో డంపింగ్ యార్డును నిర్మించారు. ప్రధాన వీధుల్లో సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా, ఇరుకు వీధుల్లో ఆటోలు, రిక్షాల్లో తరలిస్తున్నారు. డంపింగ్ యార్డుకు మాత్రం ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు. ఆటోలు, రిక్షాల ద్వారా సేకరించిన చెత్తను ఒకచోటకు చేర్చుతున్నారు. ట్రాక్టర్లపై డంపింగ్ యార్డుకు తరలించకుండా, అక్కడి చెత్తను అక్కడే వదిలేస్తున్నారు. స్థానిక ఇందిరానగర్‌లోకి వచ్చే దారిలో షుగర్ ఫ్యాక్టరీ యూనియన్ ఆఫీస్ వెనుక స్థలంలో పిఠాపురం మొత్తం సేకరించిన చెత్త తీసుకువచ్చి పడేస్తున్నారు. దీంతో రోగాలతో, విష జ్వరాలతో బాధపడతున్నామని ఇందిరానగర్ వాసులు వాపోతున్నారు. తడి చెత్త, పొడి చెత్త, జంతు కళేబరాలు, ఇంక ఇతర హానికరమైన చెత్తను తీసుకువచ్చి పడేస్తున్నారని, శానిటేషన్ సిబ్బందిని అడుగుతుంటే గవర్నమెంట్ ఇక్కడ వెయ్యమన్నదని స్థానికులు చెబుతున్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- ఎంపీపీ సత్తిబాబు, ఛైర్‌పర్సన్ అరుణ
- మండల స్థాయి క్రీడలు ప్రారంభం



వివిధ పాఠశాలల నుంచి పోటీలకు హాజరైన విద్యార్థులు

సామర్లకోట: నిత్య జీవితంలో క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం మండల పరిధిలో విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చదువుతో పాటు ఆటలపై శ్రద్ధ చూపాలన్నారు. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే చదివిన విషయాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని చెప్పారు. ఆటలలో గెలుపు, ఓటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపుపై దృష్టి సారించాలన్నారు. ఆటలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్లు ఉన్నవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు దక్కుతాయని తెలిపారు. దీనిని యువత దృష్టిలో ఉంచుకోవాలన్నారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తారని ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పెద్దాపురం, సామర్లకోట మండల స్థాయుల్లో విజేతలకు ఈ నెల 23న సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలోనే నియోజకవర్గ స్థాయి పోటీలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు పాలిక కుసుమ, బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్కూల్ గేమ్స్ ఇన్‌చార్జిలు ఎం వెంకటేశ్వర్లు, యార్లగడ్డ బంగార్రాజు, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సామర్లకోటలో స్కూల్ గేమ్స్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ



స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు